క్లుప్తంగా

దాడి కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని పొన్నాడ గ్రామానికి చెందిన సాదు ఉమ, సూర్య రమణలు తమపై కొంతమంది వ్యక్తులు దాడి చేశారని ఎచ్చెర్ల పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గొల్లంగి జోగారావు, మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరు సమీప బంధువులు కాగా, భూ వివాద కొనసాగుతోంది.

దూర విద్యలో ఇగ్నోది ఉన్నత స్థానం



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: దూర విద్యను అందించడంలో న్యూఢిల్లీకి చెందిన ఇగ్నో (ఇందిరా గాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం) ఉన్నత స్థానంలో ఉందని బీఆర్ఏయూ వీసీ కె.ఆర్.రజిని అన్నారు. విశాఖపట్నంలోని ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ రీజనల్ సెంటర్‌లో బుధవారం పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇగ్నో విశ్వవిద్యాలయం రీజనల్ కేంద్రాలు నిర్వహించి దూర విద్యలో డిగ్రీలు అందిస్తోందన్నారు. ఇది ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతోందని తెలియజేశారు. ప్రస్తుతం ఎక్కువ మంది దూర విద్యకు ప్రాధాన్యమిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ కేంద్ర సహాయకులు ఇ.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన పీఆర్టీయూ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తంగి మురళీమోహన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బకాయిలు చెల్లించాలని, కామన్ సర్వీస్ రూల్స్‌ను కల్పించాలని, పీఆర్సీ కమిషన్ నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఆయనతో పాటు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భైరి అప్పారావు, రాష్ట్ర సహాధ్యక్షుడు పప్పల రాజశేఖరరావు, బి.రవికుమార్ తదితరులు ఉన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి



వినతిపత్రం అందిస్తున్న సహకార సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఉమాశంకర చేనేత సహకార సంఘం, కొరసవాడ చేనేత పారిశ్రామిక సహకారోత్పత్తి సంఘ సభ్యులు విక్రయ సంఘం అధికార పర్సన్ ఇన్‌చార్జి శంకరరావుని కోరారు. ఈ మేరకు నగరంలోని చేనేత, జౌళీశాఖ కార్యాలయంలో బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఇప్పటికే చేనేత రంగం పూర్తిగా కుదేలైందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గొబ్బ వీరన్న, బస్వా పార్వతి, అద్దారావు, గౌరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో..!

- నారాయణపురం కాలువను పట్టించుకోని ప్రభుత్వం
- శివారు భూములకు అందని సాగునీరు
- చర్యలు తీసుకోవాలని రైతుల వేడుకోలు



నారాయణపురం కాలువ పరిస్థితి



నవభారత్ సమీపంలో కాలువలో పెరిగిన చెట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నారాయణపురం సాగునీటి కాలువపై నిర్లక్ష్యం వహిస్తోంది. గతేడాది ఖరీఫ్ సమయంలో కాలువలో అత్యవసర పనులు నిర్వహించకపోవడం వలన సాగునీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎచ్చెర్ల మండలంలో పంటలకు అత్యంత కీలకమైనది నారాయణపురం కుడి కాలువ. ఈ కాలువ పరిధిలో ఎచ్చెర్ల మండలంలో 7,175 ఎకరాలు సాగవుతున్నాయి. మొత్తం కాలువ ఫరీదుపేట నుంచి ఓలేటి అగ్రహారం వరకు 50.06 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. ఫరీదుపేట, ఇబ్రహింబాద్, పూడివలస, తమ్మినాయుడుపేట, కుశాలపురం, తోటపాలేం, కొత్తపేట, పొన్నాడ, ముద్దాడ, కొంగరాం, బొంతలకోడూరు, ధర్మవరం, రామజోగిపేట, కమ్మపేట, భగీరథపురం తదితర గ్రామాల పరిధిలో ఈ కాలువ ప్రవహిస్తోంది.

శాశ్వత మరమ్మతులు అవసరం

ఎచ్చెర్లలో ఈ కాలువ మీదనే ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తున్నారు. అందువలన శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. పిల్ల కాలువల మరమ్మతులు, షట్టర్ల మరమ్మతులు, అవసరమైన సివిల్ నిర్మాణాలు చేపట్టాలి. కాలువలో జంగిల్ క్లియరెన్స్, సాగునీరు వృథా కాకుండా మదుములు, షట్టర్ల నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పనులు నిర్వహిస్తే సమస్య పరిష్కారం అవుతుంది. మరోపక్క మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ పనులు నిర్వహణకు అవకాశం ఉంది. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. ఈ కాలువ సంతకవిటి, పొందూరు మండలాల తర్వాత ఎచ్చెర్లలో ప్రవహిస్తోంది. శివారు భూములు ఎచ్చెర్ల మండలంలో ఉన్నందున సాగునీటి సమస్య వెంటాడుతోంది.

సమస్య పరిష్కరించాలి



ఖరీఫ్‌లో నారాయణపురం కాలువ ద్వారా సజావుగా సాగునీరు అందాలంటే ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టాలి. దీనికోసం నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. కాంక్రీట్ మ్యాట్ వంటి పనులు చేస్తేనే నీరు శివారు భూములకు అందుతుంది. ఆనకట్టలో నీటి నిల్వ సామర్థ్యం పెరిగేలా చర్యలు తీసుకోవాలి.

– పంచిరెడ్డి రాంబాబు, సర్పంచ్, బొంతలకోడూరు

నిధులు మంజూరు చేయాలి



కాలువ మరమ్మతులపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలి. స్పష్టమైన అంచనాలు రూపొందించి, నిధులు మంజూరు చేయాలి. ప్రత్యేకంగా ఎచ్చెర్ల మండలంలో కాలువ మరమ్మతులు చేపట్టాలి. షట్టర్లు, బ్రాంచ్ కాలువలు బాగుచేయాలి. రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి.

– బెండు రామారావు, రైతు, ముద్దాడ

పంటలు ఎండిపోయాయి



కాలువ నుంచి సక్రమంగా సాగునీరు అందకపోవడంతో ఈ ఏడాది శివారు ముద్దాడ, రామజోగిపేట, ధర్మవరం, భగీరథపురం వంటి ప్రాంతాల్లో పంటలు ఎండిపోయాయి. కుశాలపురం నుంచి సాగునీరు సజావుగా అందడం లేదు. అందువలన వచ్చే ఖరీఫ్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి.

– సనపల నారాయణరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

డ్రోన్ నిఘా



శ్రీకాకుళం రెండో పట్టణ పీఎస్ పరిధి నాగావళి కొత్త బ్రిడ్జి, బలగ కుమ్మరి వీధి సమీప నదీ పరీవాహక నిర్మానుష్య ప్రాంతాల్లో బుధవారం డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టినట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలియజేశారు. బహిరంగంగా మద్యం, గంజాయి సేవించేవారిపై ఉక్కుపాదం మోపడమే కాకుండా, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడానికి డ్రోన్ కెమెరా ఎగురవేస్తున్నామన్నారు. ఎవరైనా పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

– శ్రీకాకుళం క్రైమ్

రూల్స్ వర్తించవా..?



పబ్లిక్ పరీక్షల సమయంలో నిర్దిష్ట పరీక్ష పూర్తయ్యేవరకు సమీపంలోని జిరాక్స్ షాపులు తెరవకూడదనే నిబంధన ఉంది. అయితే అవేమీ తమకు వర్తించవన్నట్లు శ్రీకాకుళం నగరంలోని రిమ్స్ ఆస్పత్రి రోడ్డులో ఏపీజీవీబీ బ్యాంక్ వద్ద ఒక జిరాక్స్ షాపు యజమాని వ్యవహరిస్తున్నారు. తలుపుచాటున జిరాక్సులు తీసి ఒక్కో ప్రింట్‌కు రూ.5ల నుంచి రూ.10లు వసూలు చేస్తున్నాడు. దీంతో సదరు షాపు యజమానిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

నేటి నుంచి యల్లమ్మ జాతర



యల్లమ్మ తల్లి ఆలయం

గార: మండలంలోని వమరవల్లి గ్రామ దేవత యల్లమ్మ తల్లి జాతర గురువారం నుంచి జరగనుంది. సాయంత్రం ప్రారంభమయ్యే ఈ జాతరలో రాత్రి 10 గంటల తర్వాత తిరువీధి యాత్ర జరగనుంది. మరుసటి రోజు ఉదయం నుంచి యల్లమ్మ పుట్ట వద్ద భక్తులు పూజలు చేస్తారు. ఈ జాతరలో జిల్లా ప్రజలే కాకుండా విశాఖపట్నం, విజయనగరానికి చెందిన పలు కుటుంబాలు పాల్గొంటాయి. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని సర్పంచ్ గంటా రఘునాథరెడ్డి తెలిపారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్ పత్రి



హాజరైన బ్యాంక్ ఉద్యోగులు, ఔత్సాహిక వ్యాపారులు

శ్రీకాకుళం అర్బన్: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించి ఎంఎస్‌ఎంఈ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం జనరల్ మేనేజర్ శ్రీనివాస్ పత్రి సూచించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉన్న అంబేడ్కర్ ఆడిటోరియంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్ ఆధ్వర్యంలో మెగా ఎంఎస్‌ఎంఈ అవుట్ రీచ్ క్యాంపు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ పత్రి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బ్యాంకు లోన్లపై అవగాహన పెంచుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా ఈనెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు రుణమేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలోనే అత్యధిక లావాదేవీలు నిర్వహిస్తున్న ఐదో అతిపెద్ద బ్యాంకుగా యూనియన్ బ్యాంక్ ఉందని చెప్పారు. వ్యాపారులు లోన్ ద్వారా పొందిన నిధులను ఇష్టానుసారం ఖర్చు పెట్టకుండా ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని సూచించారు. గత ఐదేళ్లలో మహిళా వ్యాపారులు మూడు రెట్లు పెరిగారని, వారికి రుణాలు అందజేసి మహిళా అభ్యున్నతికి, ఆర్థికాభివృద్ధికి యూనియన్ బ్యాంక్ ఎంతగానో తోడ్పడుతోందని వివరించారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం రమేష్ కృష్ణ, జీఎం విజయరత్నం, పీయూష్ సింగ్, రీజనల్ హెడ్ ఎంవీ వెంకట తిలక్, బ్యాంక్ యూనియన్ ప్రతినిధి బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని కార్మికుడి మృతి

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం జాతీయ రహదారిపై బుధవారం ఉదయం 6 గంటల సమయంలో శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొని జి.అప్పలనాయుడు(45) అనే కార్మికుడు మృతి చెందారు. జేఆర్‌పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. ఉదయం 6 గంటల సమయంలో ఏపీ టోరియా పరిశ్రమకు కార్మికుడు వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని కారు జాతీయ రహదారిపై పరిశ్రమ ఎదురుగా ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన అప్పలనాయుడిని విజయనగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. మృతుడిది నెల్లిమర్ల మండలంలోని తమ్మపురం గ్రామం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థుకు సీపీఆర్‌పై అవగాహన అవసరమని ప్రముఖ వైద్యుడు డాక్టర్ వినోద్ కుమార్ కూర్మాన అన్నారు. నగరంలోని ఆఫీసియల్ కాలనీలో ఉన్న గీతాంజలి పాఠశాలలో జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ అధ్యక్షుడు సింగూరు ప్రవీణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సకాలంలో సీపీఆర్ చేయగలిగితే ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటపాటలతోనే ఆరోగ్యం



శ్రీకాకుళం అర్బన్: లెమన్ స్పూన్ గేమ్‌లో పాల్గొన్న మహిళలు

శ్రీకాకుళం అర్బన్: ఆటపాటలతోనే మహిళలు, చిన్నారులకు శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ అరసవల్లి సెక్టార్ సూపర్‌వైజర్ కె.కల్యాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అరసవల్లి సెక్టారు పరిధిలోని చిన్నబరాటం వీధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు డి.శాంతమ్మ, పి.తులసీబాయి, రవణమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్: మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఇల్లిసిపురంలోని బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో మానవత స్వచ్ఛంద సంస్థ, బ్రహ్మ కుమారీస్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు ఆరోగ్య భద్రతలు, సూచనల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజిస్టు డాక్టర్ సంధ్యశ్రీ పండా మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన ఆలోచనలు కలిగి ఉండాలని సూచించారు. బ్రహ్మకుమారి ప్రతినిధి జయలక్ష్మి మాట్లాడుతూ భయాన్ని విడిచిపెడితే రోగం మనల్ని విడిచి పెడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మణిభూషణ్, మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని కిల్లిపాలెం పంచాయతీ పరిధి ఎచ్చెర్లవీధిలో ఉన్న తంగి చెరువులో ఆక్రమణలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ పంచాయతీ ప్రజలు కోరారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం బుధవారం అందజేశారు. సర్వే నంబర్ 78/13లో ఉన్న చెరువును తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ చెరువు పంట పొలాలకు సాగునీరు అందించేందుకు ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఈ చెరువు ఎల్ఎల్ఆర్‌లో కోరుకోండ వెంకట అప్పారావు తదితరుల పేరుమీద నమోదైందని, వాస్తవానికి భూబదలాయింపులో భాగంగా తంగివారి కుటుంబానికి చెరువు సంక్రమించినప్పటికీ, గ్రామ ప్రజల అవసరాలు నిమిత్తం వారి పూర్వీకులు దశాబ్దాలు క్రితమే అప్పగించడం జరిగిందన్నారు. ఇటీవల భూములకు ధరలు పెరగడంతో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులంతా కలిసి తప్పుడు పత్రాలతో కబ్జాకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో చెరువు పరిరక్షణ కమిటీ సభ్యురాలు సంధ్య, తంగి ఈశ్వరరావు, తంగి శివప్రసాద్, రెడ్డి రమణమూర్తి, రెడ్డి జ్యోతిప్రసాద్, ఎచ్చెర్ల కృష్ణ తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

రణస్థలం:



మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండలంలో పోలీస్ శాఖలోని మహిళా సిబ్బందితో జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక ఒత్తిళ్లు, పేదరికం, బాల్య వివాహాల వలన మహిళలు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, నాలుగు మండలాల ఎస్‌ఐలు ఎస్.చిరంజీవి, జి.లక్ష్మణరావు, వి.సందీప్ కుమార్, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

117 జీవో సవరణతో నష్టం

రణస్థలం: అధికారంలోకి వచ్చిన వెంటనే 117 జీవో రద్దు చేస్తామని ప్రకటించిన కూటమి నాయకులు, అధికారంలోకి వచ్చాక సవరణలు చేస్తూ విద్యా వ్యవస్థకు మరింత నష్టం చేస్తున్నారని ఆపస్ జిల్లా కార్యదర్శి జి.వెంకట గిరి ఆరోపించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 117 జీవో వలన విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు అన్ని విధాల నష్టపోతున్నారని, అందువలన జీవో రద్దుచేసి పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆపస్ మండల అధ్యక్షుడు జి.చిన్నికృష్ణంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్.రాజు పాల్గొన్నారు.


గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు



గాయాలతో పడి ఉన్న వ్యక్తి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని చిన్నబజారు సమీపంలో ఇటీవల కొత్తగా ప్రారంభించిన టీవీఎస్ షోరూమ్ ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి బుధవారం రాత్రి తీవ్ర గాయాలతో పడి ఉన్నాడు. రాత్రి 9.40 గంటల సమయంలో వ్యక్తి గాయాలతో పడి ఉన్నాడన్న సమాచారం రెండో పట్టణ పోలీసులకు రావడంతో సీఐ పి.ఈశ్వరరావు సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. ఎడమ కంటిపై బలమైన వాపు ఉండగా, జేబుల్లో ఖైనీ, గుట్కాలు తప్ప ఏమీ లేవని గుర్తించారు. మద్యం మత్తులో పడిపోయి ఉంటాడని సమాచారం. వెంటనే రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు.

అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న సుడా చైర్మన్ రవికుమార్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): భవన నిర్మాణ యజమానులకు సుడా అధికారులు సరైన అవగాహన కల్పించాలని సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ సూచించారు. శ్రీకాకుళం పట్టణాభివృద్ధి కార్యాలయంలో నూతన భవన నిర్మాణ అనుమతుల విధానంపై సమీక్ష సమావేశాన్ని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సమక్షంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు భవన నిర్మాణ యజమానులు ధ్రువపత్రాలన్నీ జతచేసి ప్లాన్‌కి దరఖాస్తు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అలా చేయకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్‌లో దరఖాస్తుదారులు భవన నిర్మాణ అనుమతులను సులభంగా పొందేందుకు అవసరమైన మార్పులను ప్రతిపాదిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుడా ప్లానింగ్ ఆఫీసర్ అమర్‌నాథ్, ఏపీవో రామ్మోహన్, జేపీవో శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



అప్పలనాయుడిని పరామర్శిస్తున్న సాయికుమార్

రణస్థలం: మండలంలోని కృష్ణాపురం పంచాయతీ గొర్లెపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మహంతి అప్పలనాయుడి తండ్రి ఇటీవల మరణించారు. దీంతో ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకుడు పిన్నింటి సాయికుమార్ బుధవారం పరామర్శించాడు. ఆయనతో పాటు నాయకులు చిల్ల వెంకటరెడ్డి, మహంతి పెదరామినాయుడు, మహంతి చినరామినాయుడు, పిన్నింటి లక్ష్మునాయుడు, కిల్లారి అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ క్యాంపస్



స్వచ్ఛ క్యాంపస్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: స్థానిక శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్‌లో స్వచ్ఛ క్యాంపస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటగోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి మునిరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఎస్ఎంపురం ఏపీ గురుకులంలో 2025–26 సంవత్సరంలో 5వ తరగతిలో 80 సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎం.గణస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7, 8వ తరగతుల్లో ఖాళీ సీట్లకు సైతం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 87126 25021 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.